క్లుప్తంగా

ఈవీఎంల వినియోగంపై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సీతానగరం: ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎలక్ట్రానిక్(ఈవీఎలు) ఓటింగ్ మిషనులో ఓటు వినియోగంపై మాస్టరు ట్రైనీల ద్వారా అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ప్రిసైడింగ్(పీఓ), సహాయ ప్రిసైడింగ్(ఏపీఓ) అధికారులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సీతానగరం మండలం నుంచి పలువురు మాస్టర్‌ట్రైనీలుగా శిక్షణ పొంది ఉన్నారని వారంతా మండలాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాలగుడబలో ప్రచారం

పార్వతీపురం టౌన్: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అలజంగి జోగారావును గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు బాలగుడబలో మంగళవారం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రెండోసారి జోగారావును గెలిపించాలని కోరారు. ప్రచారంలో స్థానిక నాయకులు ఎం.సత్యంనాయుడు, వి.శ్రీనివాసరావు, పండు, పి.తిరుపతిరావు, రాంబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

వల్లమ్మ తల్లికి పూజలు



వల్లమ్మతల్లికి పసుపు, కుంకుమలు సమర్పిస్తున్న భక్తులు

సాలూరు రూరల్: మండలం మామిడిపల్లి గ్రామంలో గ్రామదేవత వల్లమ్మ తల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేపచెట్టు కింద కొలువుతీరిన అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రార్థనలు చేశారు.

నెట్‌వర్క్‌పై ఆరా



దాసుగుమ్మడలో పోలింగ్ కేంద్రం వద్ద సూచనలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో సెల్ సిగ్నల్స్ సరిగా అందని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సమాచారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు రిటర్నింగ్ ఆఫీసర్ కల్పనా కుమారి తెలిపారు. దాసుగుమ్మడ, పెద్దతంకిడి, గుజ్జి, పెద్ద పల్లంకివలస, చిన్నపల్లంకి, బర్న పోలింగ్ కేంద్రాల్లో నెట్‌వర్క్ స్థితిగతులు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాం



ఎమ్మెల్యే కళావతిని దుశ్శాలువతో సత్కరిస్తున్న వీరఘట్టం వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: మంచికి మారుపేరుగా నిలిచిన పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మంగళవారం కలిసి దుశ్శాలువతో సత్కరించారు. కళావతిని గెలిపించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భోగి మణి, జె.అమర్‌నాథ్, శంభాన శ్రీను, బూరాడ చిన్న, కెంగువ ఆంజనేయులు, అంబళ్ల రవి, దౌలూరు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ప్రగతి పథంలో కందులపదం



గోముఖి నదిపై నిర్మించిన వంతెన

- మౌలిక వసతుల్లో ముందంజ
- రూ.6.29 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.14.88 కోట్లతో సంక్షేమ ఫలాలు

సాలూరు రూరల్: మండలంలోని కందులపదం పంచాయతీలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ పంచాయతీ నేడు ప్రగతి పథంలో పయనిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర పంచాయతీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందించేందుకు కందులపదంలో రూ.42 లక్షలతో గ్రామా సచివాలయ భవనాన్ని నిర్మించారు. పంచాయతీ పరిధిలోని 8 గ్రామాల్లో సీసీరోడ్లు, కాలువలు నిర్మించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.1.17 కోట్లతో గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. అలాగే పంచాయతీలో అర్హులైన 8497 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.14కోట్లు 88 లక్షల 37వేలు డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో అందజేశారు.

నెరవేరిన కల

పంచాయతీ ప్రజల చిరకాల స్వప్నమైన గోముఖి నదిపై వంతెన నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారమైంది. ఎన్నో ఏళ్లుగా వంతెన లేకపోవడంతో నదిని దాటేందుకు గ్రామస్తులు అవస్థలు పడేవారు. వర్షాకాలంలో అయితే గ్రామానికి రాకపోకలు నిలిచిపోయేవి. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు వంతెన నిర్మాణం కోసం ఎదురు చూశారు. గత పాలకులు హామీలు ఇవ్వడమే కాని అమలు చేసింది లేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యను ఎమ్మెల్యే రాజన్నదొర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.5.12 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణం చేపట్టారు. దీంతో సాలూరు మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు సులభతరమయ్యాయి.



తీన్‌సామంతవలసలో నిర్మించిన సీసీరోడ్డు



తీన్‌సామంతవలసలో నిర్మించిన వాటర్‌ట్యాంక్



కందులపదం గ్రామ సచివాలయం

ఇంత సంక్షేమం నేనెన్నడూ చూడలేదు



నా రాజకీయ జీవితంలో నేను ఎన్నడూ ఇంత సంక్షేమాన్ని చూడలేదు. మా కందులపదం పంచాయతీలో గతంలో ఇన్ని సంక్షేమ ఫలాలు అందుకున్నది ఎవరూ లేరు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమం, అభివృద్ధి జోడుగుర్రాల వలె పరుగులు తీసున్నాయి. ముఖ్యంగా దశాబ్దాలుగా గోముఖి నదిపై వంతెన కోసం ఎదురుచూసిన మా గిరిజన ప్రజల కల సాకారమైంది. వంతెన నిర్మాణానికి చొరవ చూపిన రాజన్నదొరకు పంచాయతీ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– తాడంగి కన్నంనాయుడు, సర్పంచ్, కందులపదం

మంచినీటి ఎద్దడి రాకూడదు

- కలెక్టర్ నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: రానున్న మూడునెలల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం కలగకుండా కావలసిన చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు, మండల ఇంజినీరింగ్ అధికారులతో మంచినీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. మంచినీటి పథకాలు, సోలార్ నీటి సరఫరా పథకాలు, బోరుబావులకు అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. మరమ్మతులను మార్చి 31 నాటికి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. రానున్న మూడు నెలలు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని, దానిని అధిగమించేందుకు కనెక్షన్ బావుల వద్ద నీటిని నిల్వ చేసేందుకు నీటి నిలువ కట్టడాలు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో నీటి శాంపిల్ తీసుకుని నాణ్యతను పరీక్షించాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారులు, మండల గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్లు నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలలో మంచినీటి పథకాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని చెప్పారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ఐటీడీఏ పాజెక్టు అధికారులు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.హేమలత, ఎ.వి.రమణ నియోజకవర్గస్థాయిలో మంచినీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి బి. సత్యనారాయణ, నీటి పారుదల శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులు సమర్థంగా పనిచేయాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి బూత్ కమిటీ సభ్యులు సమర్థవంతంగా పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో పార్వతీపురం మండల పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

- రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూం ఏర్పాటుపై పరిశీలన చేస్తున్న ఆర్వో, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఈఆర్వో, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో ఎన్నికల పీఓ, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈవీఎంల వినియోగం, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటును పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాలూరు నియోజకవర్గంకు సంబంధించి స్ట్రాంగ్ రూంను, పార్వతీపురం ఉద్యానవన కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎన్నికల సామగ్రిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు మిగిలిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీలు కనీసం 48 గంటల ముందు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే నిబంధనలకు అనుగుణంగా అనుమతులు లభిస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ విధిగా పాటించాలని కోరారు. వ్యక్తిగత దూషణలు, కుల, మత, ప్రాంతీయ తత్వాలు రెచ్చగొట్టే విధంగా ప్రచారాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింహాచలం తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ విధిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ డీఎం

సాలూరు: ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని జీసీసీ కార్యాలయంలో బ్రాంచ్ పరిధిలోని సేల్స్‌మెన్లు, డీలర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. డీఆర్‌సీ డిపోల నిర్వహణలో సమయ పాలన పాటించాలని సూచించారు. బ్రాంచి పరిధిలో అటవీ వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు, అమ్మకాలు, వసతిగృహాలకు అందిస్తున్న సరుకులు, మార్కెటింగ్ లోన్స్, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. డివిజన్ పరిధిలో అన్ని విభాగాలకు కలిసి రూ.60 కోట్లు లక్ష్యం సాధించామని తెలిపారు. అటవీ ఉత్పత్తులు ధరలు గిరిజనులకు తెలిపే విధంగా కేంద్రాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని, కొనుగోలు సమయంలో ఎటువంటి మోసాలకు పాల్పడరాదని, గిరిజనులను ఇబ్బంది పెట్టవద్దని ఆదేశించారు. క్రయ, విక్రయాల ద్వారా వచ్చే నగదును బ్యాంకులో చెల్లించే సమయంలో విధిగా వెంట రికార్డులు తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో మేనేజర్ రామారావు, అకౌంటెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



బలిజిపేట: శిక్షణను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

బలిజిపేట: ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ విధానంపై పీఓలకు శిక్షణా కార్యక్రమాన్ని ఆర్డీఓ హేమలత ఆధ్వర్యంలో బలిజిపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పీఓలు ఎన్నికలను వారివారి విధులను అనుసరించి నిర్వహించాలన్నారు. శిక్షణలో ఈవీఎంలు వినియోగం, మార్క్ పోలింగ్, వాటిని సీల్‌చేసే విధానం, ఈవీఎంలపై పూర్తి స్థాయిలో వారికి అవగాహన కల్పించారు. పోలింగ్ సమయంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నోడల్ అధికారి రమేష్‌నాయుడు, తహసీల్దార్ జీవీ.జనార్ధన్, ఎంఈఓలు సామల సింహాచలం, కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసీసీని కచ్చితంగా ఆచరించాలి

ఎన్నికల నియమావళి ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను కచ్చితంగా ఆచరించాలని మండల ఎన్నికల నోడల్ అధికారి రమేష్‌నాయుడు అన్నారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల అధికారుల సమావేశంలో ఎంసీసీపై సూచనలు చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్(అసిస్టెంట్ ఆర్ఓ) జీవి.జనార్ధన్, ఎస్ఐ పాపారావు ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

పార్వతీపురం టౌన్: ఈవీఎంలపై అవగాహన తప్పనిసరని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రిసైడింగ్ అధికారులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు, కటౌట్లు తదితర ప్రచార సామగ్రి ఉండరాదని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల విధులను పీఓలు, ఏపీఓలు అప్రమత్తంగా నిర్వహించాలని పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తహసీల్దార్ రామారావు పర్యవేక్షణలో ఎన్నికల పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంల వినియోగం, నిర్వహణ, వీవీప్యాట్స్, మార్క్‌డ్ కాపీ వాడకం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే తమ ముందున్న లక్ష్యమని ఆర్డీఓ వి.వి.రమణ అన్నారు. కురుపాం నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలకు గాను 39 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 683 మంది పీఓలు, ఏపీఓలను నియమించడం జరిగిందని, ఎన్నికల విధులపై వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,788 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచి నిలుస్తాం..

- పట్టణంలో 11వ వార్డు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం టౌన్: పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచి నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం 11వ వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్న అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చటమే కాకుండా హామీ ఇవ్వని అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను చేపట్టి రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులను మెరుగపరిచారన్నారు. విద్య, వైద్య వ్యవస్థల్లో సమూలంగా ప్రక్షాళన చేసి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి నేడు దేశంలోనే గర్వించేలా రాష్ట్రంలో విద్య, వైద్య వ్యవస్థలను మెరుగుపరాచారన్నారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలితాలే మళ్లీ ఆయన్ను 2024 ఎన్నికల్లో గెలిపించి తీరుతాయన్నారు. గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకొని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకొని మన ప్రాంతాన్ని మన రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, స్థానిక కౌన్సిలర్ సభ్యులు గెంబలి బాలమురళీకృష్ణ, తాడ్డి శంకర్రావు, జె.దివ్య, ఆర్.చిన్నం నాయుడు, వి.నేతాజీ, ఎస్.లావణ్య, కోరాడ శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మీపార్వతి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు. ఎన్.శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్లు చింతాడ శైలజ, ఆకుల శ్రీనివాసరావు, సామల లలితా కుమారి, గండి భాగ్యవతి, ఆల్తి విజయలక్ష్మి, చందాన ఆనంద్, బొంగు సురేష్, ఎస్.చంద్ర, పీరయ్య, సుధాకర్, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



సీతానగరం: కాశీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఎమ్మెల్యే ఇంటింట ప్రచారం

సీతానగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రెండవ పర్యాయం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన అలజంగి జోగారావుకు అండగా ఉంటామని కాశీపేట గ్రామస్తులు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం కాశీపేట గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ మేరకు కాశీపేట గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని జగనన్న నాయకత్వంలో అభివృద్ధి పథంలో నడిపించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పనులు జరిగాయన్నారు. సర్పంచ్ టి.ధనంజయమ్మ, సత్యం మాస్టారు, పీఏసీఎస్ ఛైర్మన్ బి.ధనంజయరావు, టి.శ్రీనివాసరావు, పార్టీ మండల నాయకులు ఎం.ప్రభాకరనాయుడు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్లను చూస్తే చంద్రబాబు గుండెల్లో రైళ్లు

- ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై చంద్రబాబునాయుడు ఆ పార్టీ నేతలతో పాటు దత్తపుత్రుడి నోట్లో నుంచి కించ పరిచే మాటలు వినిపిస్తున్నారన్నారు. మహిళల అదృశ్యానికి వలంటీర్లు కారణమని, వలంటీర్ల దెబ్బకు ప్రజలు గెద్ద కాళ్ల కింద కోడి పిల్లల్లా అల్లాడి పోతున్నారన్న రాతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికీ ప్రభుత్వ పథకాలు వలంటీర్లు డెలివర్ చేస్తున్నారు కాబట్టే టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారన్నారు. వలంటీర్లను ఉగ్రవాదులు, జిహాదీలు, స్లీపర్ సెల్స్‌తో పోల్చుతూ అత్యంత అవమానకరంగా మాట్లాడుతూ వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వలంటీర్లు రూ.5వేల గౌరవ వేతనంతో సమాజంలో నిస్వార్థంగా సేవ చేస్తున్నారన్నారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో జన్మభూమి కమిటీలకు విరుద్ధంగా.... కులం, మతం, ప్రాంతం చివరకు ఏ పార్టీ అన్న విషయం కూడా చూడకుండా రాష్ట్ర వ్యాప్తంగా నిజాయితీ, చిత్తశుద్ధితో పనిచేస్తున్న వలంటీర్లను చూసి తెలుగుదేశం పార్టీ నేతలకు కంటగింపుగా ఉందన్నారు. కోవిడ్ లాంటి మహమ్మారి సమయంలో కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన వలంటీర్లను స్లీపర్‌సెల్స్‌తో పోల్చడం అత్యంత దారుణమన్నారు.

వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

వలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం పార్టీ నేతలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున, లబ్ధి పొందుతున్న ప్రజల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. వలంటీర్లు అందరికీ తామంతా అండగా ఉన్నామన్నారు. వలంటీర్లు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సీతానగరం మండలం పార్టీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, స్థానిక కౌన్సిలర్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.